ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

5



తమిళనాడు
TAMILNADU

గురువారం 18 జూలై 2024



- ప్రబలుతున్న జ్వరాలు
- జలుబు, దగ్గుతో బాధపడుతున్న జనాలు

జబ్బుపడ్డ నగరం

చెన్నై, జూలై 17 (ఆంధ్రజ్యోతి): నగరంలో పగటి పూట భగ్గుమంటున్న ఎండలు, రాత్రి ఉరుములు, మెరుపులతో వర్షాలతో వింత వాతావరణ పరిస్థితుల మధ్య ప్రజలు పలు ఆరోగ్య సమస్యలకు గురవుతున్నారు. మరీ ముఖ్యంగా విపరీతమైన జలుబు,దగ్గుతో బాధపడుతున్నారు. వర్షాల వల్ల చాలా మంది జ్వరాలతో తీవ్ర అస్వస్థతకు గురై ఆస్పత్రుల్లో చేరుతున్నారు. ఈ కాలానుగుణ మార్పుల కారణంగా నగరంలోని పలు ప్రాంతాల్లో చిన్నారులు, వృద్ధులు జలుబు, దగ్గు, జ్వరాలతో మంచానికి పరిమితమవుతున్నారు. ఈ నేపథ్యంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో జ్వరాల బారినపడి చికిత్స కోసం చేరుతున్నవారి సంఖ్య రోజురోజుకూ అధికమవుతోంది. రాజీవ్‌గాంధీ స్మారక సర్వజన ప్రభుత్వ ఆసుపత్రి, స్టాన్లీ వైద్యకళాశాల ఆసుపత్రి, కీల్పాక్ వైద్యకళాశాల ఆసుపత్రి, ఓమందూరార్ ఎస్టేట్ ప్రభుత్వ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రులో జ్వరాలతో బాధపడుతూ చేరుతున్న ఇన్‌పేషెంట్ల సంఖ్య పెరుగుతోంది. ఈ విషయమై సీనియర్ వైద్యాధికారి ఒకరు మాట్లాడుతూ నగరంలో ఇటీవల కాలంలో కాలనుగుణ మార్పులు ఏర్పడి తరచూ వర్షాలు కురుస్తున్నాయని, దీని వల్లే జలుబు, దగ్గు, జ్వరాలు అధికమవుతున్నాయని చెప్పారు. జ్వరాలతో బాధపడుతున్నవారంతా ఆస్పత్రుల్లో చికిత్స కోసం చేరుతున్నారని చెప్పారు. నగరవాసులంతా నీటిని బాగా కాచి తాగాలని, జలుబు, దగ్గు అధికమైతే వైద్యులను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు. మరో మూడు నెలల పాటు బయట ఆహారా పదార్థాలకు స్వస్తి చెబితే మంచిదని, అదే విధంగా రోడ్‌సైడ్ దుకాణాల్లో ఆహారాపదార్థాల జోలికి వెళ్ళకూడదని, ఈగలు ముసురుతున్న తినుబండారాలను తినకూడదని ఆయన సూచించారు.

- రంగంలో ఎస్డీఆర్‌ఎఫ్ బృందాలు

నీలగిరిని ముంచెత్తిన వర్షాలు

చెన్నై, జూలై 17 (ఆంధ్రజ్యోతి): నీలగిరి జిల్లాలో నైరుతి రుతుపవనాల కారణంగా కుండపోతగా కురుస్తున్న వర్షాలకు ఊటీ, కున్నూరు, గూడలూరు, పందలూరు, దేవాలా, కోత్తగిరి, పాడందొరై, సేరంగోడు తదితర ప్రాంతాల్లో గత రెండు రోజులుగా భారీ వర్షాలు కురవటంతో పల్లపు ప్రాంతాలన్నీ జలమయమై దీవులుగా మారాయి. ఈ నేపథ్యంలో వరదపరిస్థితుల నుంచి ప్రజలను కాపాడేందుకు రాష్ట్ర విపత్తుల నిర్వహణ దళం (ఎస్డీఆర్‌ఎఫ్) అక్కడికి వెళ్లింది. గడిచిన 24 గంటల వ్యవధిలో బుధవారం మధ్యాహ్నం వరకు అవలాంచిలో 14 సెం.మీ, అప్పర్‌భవానీలో 21 సెం.మీ.ల వర్షం కురిసింది. అంతే కాకుండా ఒకే రోజు ఐదు ప్రాంతాల్లో 10 సెం.మీ.ల వర్షపాతం నమోదైంది. భారీ వర్షాలకు అవలాంచి ప్రాంతంలో ఉన్న లారెన్స్, కప్పదురై తదితర ప్రాంతాల్లోని వ్యవసాయ భూములు నీటమునిగాయి. యాభై ఎకరాలకు పైగా క్యారెట్ పంట నీట మునగటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇక నీలగిరి జిల్లాల్లో ఊటీ సహా పలు ప్రాంతాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. ఈ పరిస్థితుల్లో ప్రజలను వరద పరిస్థితులను కాపాడేందుకుగాను ఊటీ, మంచూర్, దేవాలా, గూడలూరు ప్రాంతాల వద్ద ఎస్డీఆర్‌ఎఫ్ దళాలు సహాయ పరికరాలతో సిద్ధంగా ఉన్నారు. ఇప్పటికే సుమారు 20 ప్రాంతాల్లో వరదలు సంభవించే ఆస్కారం ఉందని తెలియడంతో ఒక్కో ప్రాంతానికి పదిమంది చొప్పున ఎస్డీఆర్‌ఎఫ్ సభ్యులు సహాయక చర్యలు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నారని ప్రభుత్వ అధికారులు తెలిపారు.





అవలాంచిలో జలదిగ్బంధంలో నివాసగృహాలు

కావేరి జలాల కోసం
నేడు సుప్రీం కోర్టులో పిటిషన్

చెన్నై, జూలై 17 (ఆంధ్రజ్యోతి): కావేరి జలాల కోసం రాష్ట్ర ప్రభుత్వం గురువారం సుప్రీం కోర్టులో పిటిషన్ వేయనుంది. డెల్టా జిల్లాలకు తక్షణమే కావేరి జిల్లాలను విడుదల చేసేలా కర్ణాటక ప్రభుత్వానికి ఉత్తర్వులివ్వాలని ఆ పిటిషన్‌లో కోరనుంది. కావేరి ట్రిబ్యునల్ తుది తీర్పు, సుప్రీం కోర్టు వెలువరించిన ఉత్తర్వు, కావేరి నిర్వాహక మండలి ఆదేశాల ప్రకారం డెల్టా జిల్లాలకు కావేరి జలాలను విడుదల చేయకుండా మొండి వైఖరిని అనుసరిస్తున్న కర్ణాటక ప్రభుత్వాన్ని ఖండిస్తూ మంగళవారం ముఖ్యమంత్రి స్టాలిన్ అధ్యక్షతన జరిగిన అఖిలపక్ష సమావేశంలో తీర్మానం చేసిన విషయం విదితమే. కావేరి నిర్వాహక మండలి ఉత్తర్వు ప్రకారం కర్ణాటక ప్రభుత్వం ప్రతినెలా నిర్దేశిత పరిమాణం ప్రకారం కావేరి జలాలను విడుదల చేయడం లేదు. ఇటీవల కావేరి నియంత్రణ మండలి సమావేశమై రాష్ట్రానికి రోజూ 8 వేల ఘనపుటడుగుల కావేరి జలాలను విడుదల చేయాలని కర్ణాటక ప్రభుత్వానికి ఆదేశించింది. అయితే కర్ణాటక ప్రభుత్వం పట్టించుకోకుండా అఖిల పక్ష సమావేశం జరిపి కావేరి జలాలను విడుదల చేసే ప్రసక్తే లేదంటూ ప్రకటించింది. ఈ పరిస్థితుల్లో మంగళవారం స్టాలిన్ అధ్యక్షతన జరిగిన అఖిలపక్ష సమావేశంలో కావేరి జలాల కోసం సుప్రీం కోర్టును ఆశ్రయించాలని నిర్ణయించారు. సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాదుల చేత ఆన్‌లైన్‌లో పిటిషన్ సమర్పించాలని ప్రభుత్వం నిర్ణయిచింది. ఈ పిటిషన్‌ను అత్యవసరమైనదిగా భావించి త్వరితగతిన విచారణ జరపాలని కూడా సుప్రీంకోర్టుకు ప్రభుత్వం విజ్ఞప్తి చేయనుంది.



కోయంబత్తూరులో సబర్బన్ బస్సులను ప్రారంభిస్తున్న మంత్రి శివశంకర్

చెన్నైలో త్వరలో ఎలక్ట్రిక్ బస్సులు

- రవాణా మంత్రి శివశంకర్

చెన్నై, జూలై 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రవాణా శాఖ కొత్తగా 500 ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టనున్నదని, త్వరలో టెండర్లను ఖరారు చేసి రాజధాని నగరం చెన్నైలో 100 ఎలక్ట్రిక్ బస్సులను నడుపనున్నట్లు ఆ శాఖ మంత్రి శివశంకర్ తెలిపారు. కోయంబత్తూరు మేట్టుపాళయం రోడ్డు సాయిబాబా ఆలయ ప్రాంతంలో ఉన్న కొత్త బస్‌స్టేషన్‌లో బుధవారం ఉదయం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో కోయంబత్తూరు జోన్‌లో కొత్తగా కొనుగోలు చేసిన 20 సబర్బన్ బస్సులను ఓ సిటీ బస్సును పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఆ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ కొత్తగా కొనుగోలు చేయనున్న 500 ఎలక్ట్రిక్ బస్సుల్లో 400 బస్సులను కోవై, తిరుచ్చి తదితర ప్రముఖ నగరాల్లో నడుపనున్నామని చెప్పారు. ప్రస్తుతం రవాణా సంస్థల్లో ఉన్న పాత బస్సుల స్థానంలో కొత్తవి మార్చేందుకు ముఖ్యమంత్రి స్టాలిన్ నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు. లోక్‌సభ ఎన్నికలకు ముందే సుమారు 1000 కొత్త బస్సులను ప్రవేశపెట్టామని, ప్రస్తుతం మరిన్ని కొత్త బస్సులను నడుపనున్నామని చెప్పారు. ఈ నెల 11న ధర్మపురిలో 11 కొత్త బస్సులు, 15న తిరువళ్లూరులో 10 కొత్త బస్సులను ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రారంభించినట్లు ఆయన వివరించారు. కోయంబత్తూరు రవాణా సంస్థ పరిధిలో ఉన్న ఊటీ, తిరుప్పూరు, ఈరోడ్ ప్రాంతాల్లో కూడా కొత్త బస్సులను ప్రవేశపెట్టనున్నామని, ప్రభుత్వం 7200 కొత్త బస్సులను కొనుగోలు చేసిందని, వాటిని త్వరలో ఆయా జోన్లలో నడుపనున్నట్లు మంత్రి చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ క్రాంతికుమార్ పాటి, కార్పొరేషన్ కమిషనర్ శివగురు ప్రభాకరన్, డిప్యూటీ మేయర్ వెట్రి సెల్వన్ తదితరులు పాల్గొన్నారు.

పాదయాత్ర భక్తులపై
దూసుకెళ్లిన వ్యాన్

- నలుగురు మహిళల సహా ఐదుగురి మృతి



ఘటనా స్థలంలో రోధిస్తున్న మృతుల బంధువులు

పెరంబూర్, జూలై 17: తంజావూరు జిల్లా వలంబకుడి సమీపంలో సమయపురం మారియమ్మన్ ఆలయానికి 25 మంది బుధవారం ఉదయం పాదయాత్రగా వెళ్తుండగా, వ్యాన్ ఢీకొనడంతో నలుగురు మహిళలు సహా ఐదుగురు మృతిచెందారు. మరొకరు తీవ్రగాయాలతో చికిత్స పొందుతున్నారు. వివరాలిలా... పుదుకోట జిల్లా గంధర్వకోట కన్నుకుడి పట్టి గ్రామానికి చెందిన సుమారు 25 మంది బుధవారం తెల్లవారుజామున తిరుచ్చి జిల్లా సమయపురం మారియమ్మన్ ఆలయానికి పాదయాత్రగా బయల్దేరారు. తంజావూరు జిల్లా వలంబకుడి సమీపంలో తిరుచ్చి-తంజావూరు జాతీయ రహదారి వెంబడి నడుస్తుండగా సరుకుల లోడుతో వచ్చిన వ్యాన్ అదుపుతప్పి భక్తులపై దూసుకెళ్లింది. ఈ ఘటనలో ముత్తుస్వామి (60), మీనా (26), రాణి (37), మోహనాంబాళ్ సంఘటనా స్థలంలోనే మృతిచెందగా, సంగీత, లక్ష్మిల అనే మహిళలు తీవ్రంగా గాయపడ్డారు. చుట్టుపక్కల వారు క్షతగాత్రులను వెంటనే తంజావూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స ఫలించక లక్ష్మి మృతి చెందింది. సమాచారం అందుకున్న సెంగిపట్టి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను పోస్టుమార్టంకు తరలించి ఘటనపై కేసు నమోదుచేసి, పరారైన వ్యాన్ డ్రైవర్ సుందర్‌రాజన్‌ను అదుపులోకి తీసుకున్నారు.

మృతుల కుటుంబాలకు నష్టపరిహారం

రోడ్డు ప్రమాదం పట్ల ముఖ్యమంత్రి స్టాలిన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఘటన పట్ల సంతాపం వ్యక్తం చేయడంతో పాటు మృతుల కుటుంబాలకు తలా రూ.2 లక్షలు, గాయపడిన మహిళకు రూ.50 వేలు నష్టపరిహారం ప్రకటించారు.



రాయపేటలో ఊరేగింపులో పాల్గొన్న షియా ముస్లింలు



భక్తిశ్రద్ధలతో మొహర్రం





శరీరాలను గాయపరుచుకొని రక్తం చిందిస్తున్న షియాలు

ప్యారీస్, జూలై 17: ఇస్లాం కొత్త సంవత్సరం ప్రారంభాన్ని సూచించే మొహర్రం మాసంలో షియా ముస్లింలు బుధవారం రాష్ట్రవ్యాప్తంగా విశ్వ శాంతి కాంక్షిస్తూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రత్యేకించి మొహర్రం మాసంలో కర్బాల్లో మహమ్మద్ ప్రవక్త మనవళ్లు ఇమామ్ హుస్సేన్, ఇమామ్ హసన్‌ల త్యాగాలను స్మరించుకుంటూ పది రోజులు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ప్రత్యేక చావళ్లలో పీర్లు ఏర్పాటు చేసి ధూపం వేసి భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు నిర్వహించారు. మంగళవారం రాత్రి పీర్లు ఎత్తుకొని డప్పు చప్పుళ్లతో ధూలా ఆడారు. మతాలకతీతంగా హిందూ, ముస్లింలు కలసి రాజధాని నగరం చెన్నైలో పులియాంతోపు, రాయపేట, ఐస్‌హౌస్, రాయపురం, పటాలం, చూలై, థౌజండ్ లైట్స్, జాం బజార్, మైలాపూర్ తదితర ప్రాంతాల్లో నిర్వహించిన పీర్ల ఊరేగింపులో పాల్గొన్నారు. కాగా, చివరి రోజైన బుధవారం ఉదయం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న షియా ముస్లింలు పలు ప్రాంతాల్లో ఊరేగింపు కార్యక్రమాలు నిర్వహించారు. హసేన్, హుస్సేన్ అని నినాదాలు చేస్తూ తమ శరీరాలు గాయపరచుకొని రక్తం చిందిస్తూ భక్తిని చాటుకున్నారు.

మతసామరస్యానికి ప్రతీక ఆ గ్రామం...

తంజావూరు సమీపంలో ఉన్న కాసవలనాడు పుదూర్ గ్రామం మతసామరస్యానికి ప్రతీకగా నిలిచింది. సుమారు 500లకు పైగా కుటుంబాలు నివసిస్తున్న నేపథ్యంలో, హిందూ కుటుంబాలే అధికం. అయినప్పటికీ ప్రతి ఏటా క్రమం తప్పకుండా మొహర్రం పండుగను కోలాహలంగా జరుపుకుంటున్నారు. 300 సంవత్సరాలకు పైగా ఇక్కడున్న హిందువులు మతసామరస్యానికి అద్దం పడుతూ పీర్లు ఎత్తుకొని అగ్నిగుండం తొక్కి భక్తిని చాటుకుంటున్నారు. ఈ ఏడాది మొహర్రం సందర్భంగా 10 రోజుల క్రితం గ్రామం నడిబొడ్డున ఉన్న చెంగరైలో ఏర్పాటుచేసిన చావడిలో పీర్లు కొలువుదీర్చి ప్రార్థనలు చేశారు. మంగళవారం రాత్రి 10 గంటలకు డప్పు చప్పుళ్ళ, బాణాసంచా కాల్చి కొత్త మట్టికుండలో పానకం, అటుకులు, టెంకాయ, పండ్లు అల్లాకు నైవేద్యంగా సమర్పించారు. అనంతరం అగ్నిగుండంలో దిగి మొక్కులు చెల్లించుకున్నారు.

రూ.100 కోట్ల భూకబ్జా కేసు
మాజీ మంత్రికి సాయపడిన సీఐ అరెస్టు

చెన్నై, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మాజీ రవాణా శాఖ మంత్రి ఎం.ఆర్ విజయభాస్కర్‌పై నమోదైన రూ.100 కోట్ల భూకబ్జా కేసులో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అరెస్టయ్యారు. భూకబ్జా వ్యవహారంలో విజయభాస్కర్‌కు అన్ని విధాలా సహాయ సహకారాలందించారనే ఆరోపణలపై కరూరు సీబీసీఐడీ పోలీసులు ఆయన్ని అరెస్టు చేశారు. ఈ కేసులో బెయిల్ కోసం తీవ్రంగా ప్రయత్నించిన విజయభాస్కర్ 40 రోజులపాటు పరారీ అయి చివరకు మంగళవారం కేరళలోని తిరుచ్చూరు వద్ద అరెస్టయ్యారు. ఆ తర్వాత పోలీసులు ఆయన్ని కరూరుకు తీసుకెళ్ళి విచారణ జరిపారు. కోర్టులో హాజరుపరచగా మేజిస్ట్రేట్ 15 రోజులపాటు జ్యుడీషియల్ కస్టడీ విధించారు. దీంతో విజయభాస్కర్‌ను తిరుచ్చి జైలుకు తరలించారు. కరూరు సమీపం వాంగల్‌కుచ్చిపాళయంలో ప్రకాష్‌కు చెందిన భూములను మాజీ మంత్రి విజయభాస్కర్ బెదరించి, మోసగించి కబ్జా చేశారని, తప్పుడు సమాచారంతో ఆ భూముల పత్రాలను రిజిస్టర్ చేశారని పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారంపై సీబీసీఐడీ విచారణ చేపట్టింది. అదే సమయంలో కరూరు సబ్ రిజిస్ట్రార్ అబ్దుల్‌ఖాదర్ తప్పుడు దస్తావేజులకు సంబంధించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. 23 ఎకరాలకు చెందిన ఒరిజినల్ పత్రాలు పోయాయని, ఆ పత్రాలను కనుగొనలేకపోయామంటూ పోలీసులు అందించిన సర్టిఫికెట్ నకిలీదని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఫిర్యాదుపై కూడా సీబీసీఐడీ విచారణ జరపగా ఈ కేసులో విల్లివాక్కం సీఐ పృథ్వీరాజ్‌కు కూడా సంబంధాలున్నట్లు కనుగొన్నారు. విజయభాస్కర్ తరఫున రూ.100 కోట్ల విలువైన భూములకు సంబంధించిన పత్రాలు ధారపోయాయని, వాటిని కనుగొని అప్పగించమంటూ విల్లివాక్కం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పట్లో అక్కడ సీఐగా పని చేసిన పృథ్వీరాజ్ ఒరిజినల్ డాక్యుమెంట్లు దొరకలేదని 'నాన్ ట్రేసబుల్ సర్టిఫికెట్‌ను మాజీ మంత్రి విజయభాస్కర్‌కు ఇచ్చినట్లు విచారణలో వెల్లడైంది. తప్పుడు దస్తావేజులు తయారు చేసి సీఐ పృథ్వీరాజ్ ఈ భూకబ్జాలకు సాయపడినట్లు సీబీసీఐడీ గుర్తించింది. ఈ నేపథ్యంలో కరూరు నుంచి వచ్చిన సీబీసీఐడీ పోలీసులు సీఐ పృథ్వీరాజ్‌ను అరెస్టు చేశారు. పోలీసుస్టేషన్లలో ఆస్తిపత్రాలు ధారపోయినట్లు ఎవరైనా ఫిర్యాదు చేస్తే పోలీసు శాఖ నియమనిబంధనల ప్రకారం గాలించిన చేపట్టిన తర్వాతే 'నాన్ ట్రేసబుల్ సర్టిఫికెట్ ఇవ్వాల్సి ఉండగా సీఐ పృథ్వీరాజ్ అవేవీ పాటించకుండా మాజీ మంత్రికి 'నాన్ ట్రేసబుల్ సర్టిఫికెట్ ఇచ్చి అవినీతిలో భాగస్వామి అయినట్లు సీబీసీఐడీ అధికారులు తెలిపారు. చెన్నై నుంచి పృథ్వీరాజ్‌ను కరూరు తీసుకెళ్లి అక్కడి మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచి జైలుకు తరలించారు. సీఐ పృథ్వీరాజ్ గతంలో కరూరులో ఎస్ఐగా, సీఐగా పనిచేశారు. ఆ సమయంలో మంత్రిగా ఉన్న ఎంఆర్ విజయభాస్కర్‌తో సన్నిహిత సంబంధాలు ఏర్పరచుకున్నారు. ఆ నేపథ్యంలో విల్లివాక్కంలో సీఐగా పనిచేస్తున్న పృథ్వీరాజ్ సహాయాన్ని విజయభాస్కర్ కోరినట్లు సీబీసీఐడీ పోలీసులు తెలిపారు.



మాజీ మంత్రి విజయభాస్కర్, అరెస్టయిన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పృథ్వీరాజ్

గవర్నర్ పదవీకాలం పొడిగిస్తారా?

- 31తో ముగియనున్న ఆర్‌ఎన్ రవి పదవి

చెన్నై, జూలై 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గవర్నర్ ఆర్‌ఎన్ రవి పదవీకాలం పొడిగింపుపై రాజకీయవర్గాల్లో ఉత్కంఠ నెలకొంది. ప్రభుత్వానికి కంట్లో నలుసులా తయారైన ఆయన్ని మార్చాలని డీఎంకే వర్గాలు కోరుకుంటుండగా, రవిని కొనసాగించడమే మేలని బీజేపీ వర్గాలు భావిస్తున్నాయి. రవి పదవీకాలం ఈ నెల 31వ తేదీతో ముగియనుంది. ఈ నేపథ్యంలో వ్యక్తిగత పర్యటన పేరిట సకుటుంబ సమేతంగా ఢిల్లీ వెళ్లిన ఆర్‌ఎన్ రవి ప్రధాని నరేంద్రమోదీతో పాటు పలువురు కేంద్ర మంత్రులతోనూ భేటీ అయ్యారు. మరీ ముఖ్యంగా ప్రధానిగా మూడోమారు పదవి చేపట్టిన మోదీకి శుభాకాంక్షలు తెలిపేందుకే ఆయనతో భేటీ అయినట్లు రాజ్‌భవన్ వర్గాలు చెబుతున్నా.. అసలు విషయం అది కాదన్నది రాజకీయవర్గాల అంచనా. ఈ నెలాఖరుతో తన పదవీకాలం ముగియనున్నందున పొడిగింపుపై చర్చించేందుకే ఆయన మోదీతో భేటీ అయినట్లు రాజకీయవర్గాలు చెబుతున్నాయి. అదే విధంగా బుధవారం కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతోనూ గవర్నర్ సమావేశమయ్యారు. ఆ తరువాత రాష్ట్రపతితోనూ రవి భేటీ కానున్నట్లు రాజ్‌భవన్ వర్గాలు చెబుతున్నాయి. శుక్రవారం సాయంత్రం చెన్నై చేరుకోనున్న రవికి కేంద్రం ఎలాంటి కబురు చెబుతుందోనని ఆయన సన్నిహితులు ఉత్కంఠతో ఎదురు చూస్తున్నారు.



అమిత్‌షాతో గవర్నర్ రవి

మార్పు తప్పదా? : 2019 ఆగస్టు 1వ తేదీ నాగాలాండ్ గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టిన ఈ మాజీ ఐపీఎస్ అధికారి.. 2021 సెప్టెంబరు 19న తమిళనాడు గవర్నర్‌గా ప్రమాణం చేశారు. అంటే గవర్నర్‌గా ఆయన పదవీకాలం ఈ నెలాఖరుతో ఐదేళ్లు పూర్తి కానుంది. రవి కంటే ముందు ఆ పదవిలో వున్న భన్వరీలాల్ పురోహిత్ పదవీ కాలం ముగియగానే పంజాబ్ గవర్నర్‌గా బదిలీ చేశారు. దాంతో రవి పదవీకాలం పొడిగింపు ఉండకపోవచ్చని రాజకీయవర్గాలు భావిస్తున్నాయి. ఆయన్ని మార్చే అవకాశాలే ఎక్కువగా వున్నాయని బీజేపీ వర్గాలు కూడా చెబుతున్నాయి. ఈ నెల 22న ప్రారంభం కానున్న లోక్‌సభ సమావేశాలు ముగిసిన అనంతరం గవర్నర్ పదవీ కాలం పొడిగింపుపై స్పష్టత వస్తుందని ఆ వర్గాలు చెబుతున్నాయి. నిజానికి రవి గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి రాష్ట్ర ప్రభుత్వంతో ఎడమొహం పెడమొహంగానే వ్యవహరించారు. పలు వివాదాస్పద నిర్ణయాలతో ప్రభుత్వాన్ని ఇరుకునబెట్టేందుకు ప్రయత్నించి చిక్కుల్లో పడ్డారు. ఆఖరికి మంత్రి తొలగింపు వ్యవహారంలో సుప్రీం కోర్టు చేత చీవాట్లు తినాల్సి వచ్చింది. అప్పుడే ఆయన్ని తొలగిస్తారని అన్ని వర్గాలు భావించినా, కేంద్రం రవికి అండగా నిలిచింది. మరి ఇప్పుడు ఆయన పదవీ కాలాన్ని పొడిగిస్తుందా? లేక మరేదైనా నిర్ణయం తీసుకుంటుందా అన్నదానిపై బీజేపీ వర్గాలు సైతం ఆసక్తితో ఎదురు చూస్తున్నాయి. ఈ వ్యవహారంపై ఓ బీజేపీ సీనియర్ నేత మాట్లాడుతూ.. రవి పదవీకాలం పొడిగించని పక్షంలో ఈ సారి తెలుగు రాష్ట్రాలకు చెందిన వ్యక్తి గవర్నర్‌గా వచ్చే అవకాశముందని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో తెలుగువారు ఎక్కువమంది ఉండడంతో వారిని ప్రభావితం చేయగలిగిన వ్యక్తినే గవర్నర్‌గా నియమించవచ్చని వివరించారు.

సమాచార ధ్వని

15 వరకు పేరు నమోదుకు గడువు

ఐసిఎఫ్, జూలై 17: అఖిల లోక ముత్తమిళ్ మురుగన్ మహానాడులో పాల్గొనేందుకు ఆగస్టు 15వ తేది వరకు పేరు నమోదుకు గడువు పొడిగించినట్లు దేవాదాయ మంత్రి శేఖర్ బాబు వెల్లడించారు. దిండుగల్ జిల్లా పళనిలో ఆగస్టు 24,25 తేదీల్లో ముత్తమిళ్ మురుగన్ మహానాడు జరుగనుంది. ఇందులో పాల్గొనేందుకు https://muthamizhmuruganmaanadu2024.com అనే వెబ్‌సైట్‌లో పేరు, పరిశోధన వ్యాసాల నమోదు ప్రక్రియ జరుగుతుంది. ఈ నెల 15వ తేదీతో ఈ గడువు ముగియగా, పరిశోధన విద్యార్థుల విజ్ఞప్తి మేరకు, ఆగస్టు 15వ తేది వరకు గడువు పొడిగించారు.

సహకార మేనేజ్‌మెంట్ డిప్లొమో కోర్సుల్లో ప్రవేశాలు

ఐసిఎఫ్, జూలై 17: సహకార మేనేజ్‌మెంట్ డిప్లొమో కోర్సులో చేరేందుకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని చెన్నై జిల్లా కలెక్టర్ రష్మి సిద్ధార్ తెలిపారు. చెన్నై సహకార నిర్వహణ కేంద్రంలో 2024-25 సంవత్సరం ఫుల్ టైమ్ సహకార మేనేజ్‌మెంట్ డిప్లొమో కోర్సులకు అడ్మిషన్లు జరుగుతున్నాయి. ప్లస్ టూ ఉత్తీర్ణులై 17 ఏళ్లు పూర్తయినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఫీజు రూ.18,750. ఈ కోర్సులు తమిళంలో మాత్రమే నిర్వహిస్తారు. స్థానిక బ్రాడ్‌వే, తేనాంపేట, రెడ్‌హిల్స్‌లో ఉన్న శిక్షణా కేంద్రంలో చేరేందుకు ఆసక్తి ఉన్న విద్యార్థులు www.tncu.tn.gov.in అనే వెబ్‌సైట్‌లో శుక్రవారం సాయంత్రం లోగా దరఖాస్తు చేసుకోవాలి. ఇత వివరాలకు 044-25360041 నెంబరు సంప్రదించవచ్చు.

10 నుంచి కోవై-అబుదాబి విమానాలు

పెరంబూర్, జూలై 17: కోయంబత్తూర్ నుంచి అబుదాబికి విమాన సేవలు ఆగస్టు 10వ తేది నుంచి ప్రారంభిస్తున్నట్లు ఇండిగో సంస్థ ప్రకటించింది. ప్రస్తుతం కోవై విమానాశ్రయం నుంచి షార్జా, సింగపూర్‌కు మాత్రమే అంతర్జాతీయ విమానాలు నడుపుతుండగా, అబుదాబికి కూడా ప్రారంభం కానున్నాయి. కోవై నుంచి వారంలో మూడు రోజులు మంగళవారం, గురువారం, శనివారం ఈ విమాన సేవలు అందుబాటులో ఉంటాయని ఇండిగో సంస్థ తెలిపింది.

26, 28 తేదీల్లో రామనాథపురం బైవీక్లీ ఎక్స్‌ప్రెస్ రద్దు

చెన్నై, జూలై 17 (ఆంధ్రజ్యోతి): రైల్వే మార్గంలో మరమ్మతుల కారణంగా తాంబరం - రామనాథపురం బైవీక్లీ ఎక్స్‌ప్రెస్ (06051)ను ఈ నెల 26, 28 తేదీల్లో రద్దు చేసినట్లు దక్షిణ రైల్వే ప్రకటించింది. అదే విధంగా రామనాథపురం - తాంబరం బైవీక్లీ ఎక్స్‌ప్రెస్ (06052) కూడా ఈ నెల 22, 27, 29 తేదీల్లో రద్దు చేసినట్లు దక్షిణరైల్వే పేర్కొంది.

ఎంటీసీ ఉద్యోగులకు హెల్ప్ లైన్ నెంబర్

ఐసిఎఫ్, జూలై 17: ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఎంటీసీ హెల్ప్ లైన్ నెంబర్‌ను పరిచయం చేసింది. మెట్రోపాలిటన్ రవాణా సంస్థ (ఎంటీసీ) ప్రధాన కార్యాలయం, అన్ని డిపోలు, బస్టాండ్లలో పని చేసే ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కార్యాలయ పనిదినాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5.45 గంటల వరకు పనిచేసేలా 9445049057 అనే హెల్ప్ లైన్ నెంబరును ఎంటీసీ మేనేజింగ్ డైరెక్టర్ ఆల్బీజాన్ వర్గీస్ పరిచయం చేశారు.

పాలిటెక్నిక్‌లో ఇంటర్న్‌షిప్ ఏడాది పొడిగింపు

ఐసిఎఫ్, జూలై 17: పాలిటెక్నిక్ విద్యార్థులకు ఆరు నెలల ఇంటర్న్‌షిప్‌ను ఏడాది వరకు పొడిగిస్తూ సాంకేతిక విద్య డైరెక్టరేట్ ఉత్తర్వులు జారీచేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 500 ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలల్లో టెన్త్ పాసైన విద్యార్థులు మొదటి సంవత్సరంలో, ప్లస్ టూ పాసైన విద్యార్థులు రెండో సంవత్సరంలో చేరుతున్నారు. మూడేళ్ల డిప్లొమో ఇంజనీరింగ్ చదివే విద్యార్థుల వృత్తి నైపుణ్యాభివృద్ధి పెంపొందించేలా ఆరు నెలలు ఇంటర్న్‌షిప్ శిక్షణ ఇస్తున్నారు. ఈ శిక్షణా కాలం ఏడాదికి పొడిగిస్తూ సాంకేతిక విద్య డైరెక్టరేట్ కమిషనర్ వీరరాఘవరావు ఉత్తర్వులు జారీచేశారు.

24, 25న హిస్టరీ టీచర్ల సదస్సు

ఐసిఎఫ్, జూలై 17: స్థానిక ఎగ్మూర్‌లోని ప్రభుత్వ మ్యూజియం ప్రాంగణంలో హిస్టరీ టీచర్లకు ఈ నెల 24,25 తేదీల్లో సదస్సు జరుగనుంది. 'మన కళలు, ప్రాచీనత తెలుసుకుందాం' అనే శీర్షికతో నిర్వహిస్తున్న ఈ శిబిరంలో నగరం, శివారు ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల చరిత్ర ఉపాధ్యాయులు పాల్గొననున్నారు. ఈ రెండు రోజుల్లో కార్యక్రమంలో పాల్గొనే ఉపాధ్యాయులకు సర్టిఫికెట్లు అందజేయనున్నట్లు ప్రభుత్వం తెలిపింది.

మహిళల కోసం న్యాయ సలహా కేంద్రం

ఐసిఎఫ్, జూలై 17: రాష్ట్ర మహిళా కమిషన్‌లో మహిళలకు ఉచిత న్యాయ సలహా కేంద్రం ప్రారంభించారు. రాష్ట్రంలో మహిళా కమిషన్ 1993 నుంచి పనిచేస్తోంది. చేపాక్కం కలశా మహల్ భవనంలో ఉన్న ఈ కమిషన్‌లో ఉచిత న్యాయ సలహా కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ కేంద్రానికి రాష్ట్ర ఉచిత న్యాయపనుల కమిషన్ ద్వారా న్యాయవాదులు నియమితులయ్యారు. వారంలో ఐదు రోజులు (శనివారం మినహా) మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ కేంద్రం పనిచేయనుంది.

810 మెగావాట్ల విద్యుదుత్పత్తికి అంతరాయం

ఐసిఎఫ్, జూలై 17: ఉత్తర చెన్నై థర్మల్ విద్యుత్ కేంద్రంలో మరమ్మతుల కారణంగా 810 మెగావాట్ల విద్యుదుత్పత్తికి అంతరాయం కలిగింది. అత్తిపట్టులో ఉన్న ఈ కేంద్రంలో మొదటి స్టేషన్‌లో మూడు యూనిట్లలో తలా 210 మెగావాట్లు, రెండవ స్టేషన్‌లో రెండు యూనిట్లలో తలా 600 మెగావాట్లు మొత్తం 1830 మెగావాట్ల ఉత్పత్తి జరుగుతోంది. ఈ నేపథ్యంలో, రెండవ స్టేషన్ మొదటి యూనిట్లో బాయిలర్ ట్యూబ్ లీకేజీ కారణంగా, 1వ స్టేషన్ రెండో యూనిట్‌లో వార్షిక పర్యవేక్షణ కారణంగా 810 మెగావాట్ల ఉత్పత్తి నిలిచిపోయింది. మరమ్మతుల అనంతరం ఉత్పత్తి ప్రారంభిస్తామని అధికారులు తెలిపారు.

అదనంగా నైరుతి రుతుపవన వర్షాలు

ఐసిఎఫ్, జూలై 17: రాష్ట్రంలో నైరుతి రుతుపవన వర్షాలు సాధారణ స్థాయికన్నా 88 శాతం అధికంగా కురిసినట్లు వాతావరణ పరిశోధన కేంద్రం తెలిపింది. ఈ వర్షాలు జూన్‌లో ప్రారంభమై సెప్టెంబరు వరకు నాలుగు నెలలు కురుస్తాయి. దేశవ్యాప్తంగా నైరుతి వర్షాలు తీవ్రరూపం దాల్చాయి. కర్ణాటక, కేరళలో భారీవర్షాలు కురుస్తున్నాయి. కేరళలోనే కాకుండా రాష్ట్రంలోనూ మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. ఆ ప్రకారం, జూన్ 1 నుంచి ఈ నెల 17వ తేది వరకు రాష్ట్రంలో 160.6 మి.మీ వర్షం కురిసింది. ఈ సమయంలో సాధారణ వర్షపాతం 88.5 మి.మీ కాగా, ఇప్పటివరకు 88 శాతం అధిక వర్షపాతం నమోదైంది.

దేవర్‌మలై దారిలో ఏనుగుల సంచారం

● వాహనాల రాకపోకలకు అంతరాయం



రోడ్డుపై నిలిచిన ఏనుగు సమీపంలోకి వెళ్లి సెల్ఫీ తీసుకుంటున్న వాహనచోదకుడు

చెన్నై, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఈరోడ్ జిల్లా దేవర్‌మలై రహదారిలో బుధవారం ఉదయం ఏనుగులు సంచరించడంతో ఆ మార్గంలో గంటకు పైగా వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఆ జిల్లాలోని సత్యమంగళం పులుల అభయారణ్యం వద్ద 10 ఫారెస్ట్ సర్కిళ్లున్నాయి. ఆ ప్రాంతాల్లో ఏనుగులు, పులులు, చిరుతలు, అడవి దున్నలు, జింకలు, ఎలుగుబంట్లు సంచరిస్తుంటాయి. ముఖ్యంగా ఏనుగులు అధిక సంఖ్యలో జనావాస ప్రాంతాల వైపు వస్తుండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో అందియూరు సమీపం బర్గూరు కొండ ప్రాంతం నుండి బుధవారం ఉదయం వచ్చిన అడవి ఏనుగులు దేవర్‌మలై - తామరైకరై రహదారిలో సంచరించాయి. దీంతో ఆ మార్గంలో వెళ్లే వాహన చోదకులు తమ వాహనాలను నిలిపివేసి ఏనుగులు రోడ్డు దాటి వెళ్లేంతవరకూ వేచి ఉంటున్నారు. ఈ నేపథ్యంలో ఓ పెద్ద అడవి ఏనుగు ఆ రోడ్డు దాటకుండా చాలా సేపటివరకూ నిలిచి ఉండటంతో వాహనచోదకులు భీతిల్లారు. కొందరు ప్రమాదాన్ని లెక్క చేయకుండా ఆ ఏనుగు దగ్గరగా వెళ్లి సెల్ఫీలు తీసుకునేందుకు పోటీపడ్డారు. ఈ సమాచారం అందగానే అటవీ శాఖ అధికారులు హుటాహుటిన వెళ్లి అడవి ఏనుగును తరిమికొట్టేందుకు ప్రయత్నించారు. సుమారు గంటపాటు పలు రకాలుగా ప్రయత్నించిన మీదట ఆ ఏనుగును అడవిలోకి తరిమికొట్టారు. ఈ సంఘటన కారణంగా గంటకు పైగా ఆ మార్గంలో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

డీఎంకే పాలనలో రూ.3 లక్షల కోట్ల రుణభారం

● అమ్మావిన్ మక్కల్ పర్యాటనలో శశికళ



ప్యారీస్, జూలై 17: మూడేళ్ల డీఎంకే పాలనలో అభివృద్ధి శూన్యమని, రుణ భారం రూ.3 లక్షల కోట్లకు పెరిగిందని వీకే శశికళ విమర్శించారు. 'అమ్మావిన్ వళియిల్ మక్కల్ పయనం' ఐదు రోజుల పర్యటన కార్యక్రమానికి బుధవారం తెన్‌కాశి జిల్లా కుత్రాలం జలపాతాల రహదారి కూడలి నుంచి ఆమె శ్రీకారం చుట్టారు. చీలికలైన అన్నాడీఎంకేను ఏకం చేయాలన్న సంకల్పంతో శశికళ అన్నాడీఎంకే అసమ్మతి నాయకులు, కార్యకర్తలు, ప్రజలను కలవనున్నారు. ఇందుకోసం ఆమె మంగళవారం సాయంత్రం మదురై చేరుకున్నారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో అర్ధరాత్రి తెన్‌కాశి వెళ్లారు. ఆమెకు మద్దతుదారులు ఘన స్వాగతం పలికారు. బుధవారం మధ్యాహ్నం 2.30 గంటలకు కుత్రాలం నుంచి వ్యాన్‌లో ప్రచారానికి బయల్దేరిన శశికళ కాశిమేజర్‌పురంలో రోడ్ షోలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ... అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చకుండా డీఎంకే ప్రభుత్వం మోసం చేసిందని వ్యాఖ్యానించారు. తెన్‌కాశి జిల్లాలో 10 రోజులకు ఒకసారి తాగునీటి సరఫరా అవుతోందని, అయినా దీనిపై ముఖ్యమంత్రి పట్టించుకోలేదని ఆరోపించారు.

20న హైకోర్టు మదురై బెంచ్ వార్షికోత్సవం

పెరంబూర్, జూలై 17: మద్రాసు హైకోర్టు మదురై బెంచ్ 20వ వార్షికోత్సవం ఈ నెల 20వ తేది మదురై తముక్కం మైదానంలోని ఆడిటోరియంలో జరుగనుంది. ఈ వేడుకల్లో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు ఎంఎం.సుందరేశ్, విశ్వనాథన్, ఆర్.మహాదేవన్, సూర్యకాంత్, బీఆర్ కవాయ్ తదితరులు పాల్గొననున్నారు.

రోడ్‌సైడ్ నివాసాల తొలగింపు

● జార్జిటౌన్‌లో అధికారుల పరిశీలన



జార్జిటౌన్‌లో రోడ్డుపక్క ఉన్న గుడిసెలు

చెన్నై, జూలై 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్యారీస్ కార్నర్ జార్జిటౌన్ ప్రాంతంలో మూడుతరాలపాటు రోడ్డు పక్కగా రేకుల షెడ్లు, టార్పాలిన్‌తో గుడిసెలు వేసుకుని నివసిస్తున్నవారిని తొలగించేందుకు కార్పొరేషన్ అధికారులు ప్రయత్నాలు ప్రారంభించారు. జార్జిటౌన్‌లోని జాఫర్ సారంగ్, నారయణప్పా వీధిలో వందకు పైగా కుటుంబాలు రోడ్డు పక్కగా గుడిసెలు, రేకుల షెడ్లు వేసుకుని నివసిస్తున్నాయి. వీరందరికి ప్రత్యామ్నాయ ప్రాంతంలో ఇళ్ళను కేటాయించేందుకు కార్పొరేషన్ అధికారులు నిర్ణయించారు. ఆ మేరకు బుధవారం ఆ ప్రాంతాల్లో రోడ్డు పక్కగా ఉన్న రేకుల షెడ్లు, గుడిసెల వివరాలను కార్పొరేషన్ అధికారులు సేకరించారు.

విదేశాలకు తగ్గిన కోడిగుడ్ల ఎగుమతి

పెరంబూర్, జూలై 17: ఐరోపా దేశాల్లో ఎండలు అధికంగా ఉండడంతో కోడిగుడ్ల వినియోగం తగ్గి, నామక్కల్ నుంచి ఎగుమతులు గణనీయంగా తగ్గాయి. విదేశాలకు పంపే కోడిగుడ్ల ఎగుమతుల్లో 70 శాతం తగ్గినట్లు కోళ్ల ఫారం యజమానులు తెలిపారు. నామక్కల్ నుంచి ప్రతిరోజు 70 లక్షల కోడిగుడ్లు ఎగమతి చేస్తున్నట్లు, ప్రస్తుతం 15 లక్షల్లోపే కోడిగుడ్లు ఎగుమతి చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

మైలాపూర్‌లో బాల్య వివాహం

ఐసిఎఫ్, జూలై 17: స్థానిక మైలాపూర్‌లో 15 ఏళ్ల బాలుడితో 9 ఏళ్ల బాలికకు వివాహం జరిపించిన తల్లిదండ్రులపై పోలీసులు కేసు నమోదుచేశారు. ఈ నెల 12వ తేది బాల్యవివాహాన్ని ఇరుతరపు తల్లిదండ్రులు జరిపించినట్లు, వారిపై చర్యలు చేపట్టాలని కోరుతూ మైలాపూర్ పోలీస్‌స్టేషన్‌లో చెన్నై జిల్లా సాంఘిక కార్యాలయం ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశారు. దీనికి సంబంధించి మైలాపూర్ పోలీసులు విచారణ జరిపి ఆ బాలుడు, బాలికను కెల్లీస్‌లో ఉన్న హోంకు తరలించారు.

శబ్దకాలుష్య పర్యవేక్షణకు ఆధునిక స్కానర్

ఐసిఎఫ్, జూలై 17: చెన్నై, కోయంబత్తూర్, మదురై, తిరుచ్చి నగరాల్లో శబ్దకాలుష్య పర్యవేక్షణకు ఆధునిక స్కానర్లు ఏర్పాటుచేయనున్నట్లు కాలుష్య నియంత్రణ బోర్డు అధికారులు తెలిపారు. ప్రపంచ ఆరోగ్య సంస్థలు విధించిన పరిధి ప్రకారం, 50 నుంచి 55 డెసిబుల్ వరకు ఉన్న శబ్దం సురక్షితమైనది. 85 డెసిబుల్‌కు పైగా ఉంటే మనుషులకు ప్రమాదం కలిగిస్తోంది. రాష్ట్రంలో ఎక్కువ జనాభా ఉన్న ప్రాంతాల్లో మాత్రమే కాలుష్య నియంత్రణ చర్యలు చేపడుతున్నారు. దీపావళి పండుగ సమయాల్లో బాణాసంచా వల్ల ఏర్పడే శబ్దకాలుష్యాన్ని మాత్రమే ప్రధానంగా పరిగణలోకి తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో, ఇతర కారణాల వల్ల ఏర్పడే శబ్దకాలుష్య నియంత్రించేలా కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా నివాస ప్రాంతాలు, ట్రాఫిక్ జంక్షన్లు, ఆసుపత్రులు, కర్మాగారాలున్న ప్రాంతాల్లో ఆధునిక స్కానర్లు ఏర్పాటు చేసి పర్యవేక్షించనున్నట్లు అధికారులు తెలిపారు.

ఏనుగు దంతాల విక్రయం

● నలుగురి అరెస్టు

అడయార్, జూలై 17: ఈరోడ్ జిల్లా అందియూరు సమీపంలోని గురునాథ స్వామి ఫారెస్ట్ ఏరియాలో ఏనుగు దంతాల విక్రయించిన కేసులో నలుగురిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ అటవీ ప్రాంతంలో ఫారెస్ట్ రేంజర్ మురుగేశన్ సారథ్యంలో అటవీ సిబ్బంది పెట్రోలింగ్ నిర్వహించారు. ఆ సమయంలో ఒక కారు వద్ద నలుగురు వ్యక్తులు అనుమానాస్పదంగా నిలబడివున్నారు. వీరిని అదుపులోకి తీసుకుని విచారించగా, వారివద్ద ఏనుగు దంతాలు గుర్తించారు. దీంతో గుణశేఖరన్, శాంతప్పా, కందస్వామి, సెంథిల్ కుమార్ అనే నలుగురిని అరెస్టు చేశారు. వీరి నుంచి 12.700 కేజీల నాలుగు ఏనుగు దంతాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

చేపల వేటపై కొనసాగుతున్న నిషేధం

● ఇళ్లకే పరిమితమైన జాలర్లు



రామేశ్వరం తీరంలో నిలిపి ఉంచిన పడవలు

చెన్నై, జూలై 17 (ఆంధ్రజ్యోతి): బంగాళా ఖాతంలో అల్పపీడనం కారణంగా సముద్రంలో అలల ఉధృతి అధికమై పెనుగాలులు వీస్తుండటంతో రామేశ్వరం జాలర్లు బుధవారం ఉదయం కూడా చేపలవేటకు వెళ్లలేదు. గంటకు 55 నుండి 60 కి.మీల వేగంతో పెనుగాలులు వీస్తాయని, జాలర్లు చేపలవేటకు వెళ్ళకూడదని అధికారులు ప్రకటించారు.దీంతో జాలర్లు రామేశ్వరం, పాంబన్, మండపం, దేవిపట్టినం, చోళింగుడి, తొండి, కీళ్‌కరై, ఏర్వాడి, మూగైయూరు ప్రాంతాలకు చెందిన సుమారు 1500 మోటారు పడవలు, 6 వేల నాటుపడవలను తీరంలోనే నిలిపివేశారు. గత రెండు రోజులుగా రామేశ్వరం జాలర్లు చేపలవేటకు వెళ్లడం లేదు. ప్రస్తుతం బంగాళాఖాతంలో మరో అల్పపీడనం కూడా ఏర్పడి తుఫానుగా మారే అవకాశాలున్నట్లు వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు.

విజయకరిశల్‌కుళంలో శంఖం లభ్యం



ఐసిఎఫ్, జూలై 17: విరుదునగర్ జిల్లా విజయకరిశల్‌కుళంలో మూడో విడత తవ్వకాల్లో శంఖం లభించింది. ఇప్పటి వరకు 600లకు పైగా బంకమట్టి బొమ్మలు, ఇతర వస్తువులు లభించగా, మంగళవారం గాజుల తయారీకి వినియోగించే ముడి పదార్థమైన శంఖం లభించింది. ఈ విషయమై పురావస్తు పరిశోధకులు మాట్లాడుతూ... పూర్వీకులు ఆభరణాలకు ప్రాధాన్యత ఇచ్చారని, వారు ఎక్కువగా గవ్వలతో తయారుచేసిన గాజులు, గాజుపూసలు, బంకమట్టితో తయారుచేసిన ఆభరణాలు వినియోగించినట్లు తెలుస్తోందని పేర్కొన్నారు.

125 అడుగులు దాటిన పెరియార్ డ్యామ్ నీటిమట్టం

అడయార్, జూలై 17: ఎగువ ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో రాష్ట్రంలోని రిజర్వాయర్లలో జలకళ సంతరించుకుంది. ముల్లై పెరియార్ డ్యామ్ నీటి మట్టం 120 అడుగులకు చేరుకుంది. రెండు రోజుల క్రితం 121.05 అడుగులున్న నీటిమట్టం బుధవారానికి 125.10 అడుగులకు చేరుకున్నట్లు ప్రజాపనుల శాఖ అధికారులు వెల్లడించారు. ఈ డ్యామ్ నుంచి తమిళనాడు రాష్ట్రంలోకి సెకనుకు 5395 ఘనపుటడుగుల నీటిని విడుదల చేస్తున్నారు. అదేవిధంగా 73 అడుగులు కలిగిన వైగై డ్యామ్‌లో ప్రస్తుత నీటిమట్టం 52.36 అడుగులంది. ఈ డ్యామ్‌లోకి సెకనుకు 1671 ఘనపుటడుగుల నీరు వస్తోంది. మరోవైపు ఈరోడ్ జిల్లా సత్యమంగళంలోని భవానీ సాగర్ రిజర్వాయర్ నీటి మట్టం ఒకే రోజు ఏకంగా నాలుగడుగుల మేర పెరిగింది. ఈరోడ్, తిరుపూరు, కరూర్ జిల్లాల్లో గత కొన్ని రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో ఈ రిజర్వాయర్‌కు అధికంగా నీరు చేరుతుండడంతో బుధవారం ఉదయానికి ఈ డ్యామ్ నీటిమట్టం 74.48 అడుగులకు చేరుకుంది. రిజర్వాయర్‌లో 12.9 టీఎంసీల నీరు నిల్వవుంది. ఒకే రోజు నాలుగు అడుగుల మేరకు నీటిమట్టం పెరగడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వైభవంగా ముత్తుమారియమ్మన్ ఆలయ కుంభాభిషేకం



మేయర్‌కు పూర్ణకుంభ స్వాగతం

వేలూరు, జూలై 17: స్థానిక కొత్త బస్టాండ్ సమీపంలోని అన్నానగర్ ముత్తుమండపం ముత్తు మారియమ్మన్ ఆలయ కుంభాభిషేకం (అష్టబంధన) బుధవారం వైభవంగా జరిగింది. హోమాలు, గోపూజ, గోపుర విమానానికి కుంభాభిషేకం, భక్తులకు అన్నదానం కార్యక్రమం జరిగింది. వేడుకలకు ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కార్తికేయన్, వేలూరు కార్పొరేషన్ మేయర్ సుజాత, 17వ వార్డు కౌన్సిలర్ కాంచన తదితరులు పాల్గొన్నారు.

పేర్నాంబట్టులో ఉచిత వైద్యశిబిరం



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య బృందం

వేలూరు, జూలై 17: మనోరంజితం చారిటబుల్ ట్రస్ట్, జిల్లా అంధ నిర్మూలన సంఘం, చెన్నై అగర్వాల్ కంటి ఆస్పత్రి, రీసెర్చి కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరం జరిగింది. పేర్నాంబట్టు శివప్రియ ఆస్పత్రిలో జరిగిన కార్యక్రమానికి డా.శివకుమార్ అధ్యక్షత వహించగా, చెన్నై డా.అగర్వాల్ కంటి ఆసుపత్రికి చెందిన సతీష్ కుమార్ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ శిబిరంలో 50 మందికి పైగా కంటి పరీక్షలు నిర్వహించారు. మాజీ ప్రధానోపాధ్యాయులు, రొటేరియన్ జయరాజ్ వందన సమర్పణతో శిబిరం ముగిసింది.

తిరుచ్చెందూరు ఆలయంలో రథోత్సవం రద్దు

అడయార్, జూలై 17: తూత్తుక్కుడి జిల్లాలోని తిరుచ్చెందూరు సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో ప్రతి రోజూ నిర్వహించే బంగారు రథోత్సవాన్ని తాత్కాలికంగా రద్దు చేశారు. ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న అభివృద్ధి పనుల కారణంగా ఈ రథోత్సవాన్ని తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్టు ఆలయ అధికారులు వెల్లడించారు. ఈ బంగారు రథోత్సవ సేవలో భక్తులు ఒకరికి రూ.2500 రుసుం చెల్లించి పాల్గొనే అవకాశం ఉంది. ఇందుకోసం ముందస్తు రిజర్వు చేసిన భక్తులు బుధవారం ఉదయాన్నే ఆలయానికి వచ్చి బంగారు రథోత్సవ సేవలో పాల్గొనేందుకు వేచివున్నారు. ఇంతలోనే ఆలయ అధికారులు ఈ సేవను తాత్కాలికంగా రద్దు చేసినట్టు ప్రకటించారు. దీంతో భక్తులు తీవ్ర నిరాశకు లోనయ్యారు. కాగా, ప్రస్తుతం ఆలయంలో రూ.200 కోట్ల అభివృద్ధి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.

23 నుంచి చెన్నై బీచ్-తాంబరం మధ్య సబర్బన్ రైళ్ల రద్దు

పెరంబూర్,జూలై17:తాంబరం యార్డ్ స్టేషన్‌లో స్టేజ్-2లో చేపట్టనున్న మరమ్మతుల కారణంగా ఈ నెల 23నుంచి ఆగస్టు 14వతేదివరకు చెన్నై బీచ్-తాంబరం-చెంగల్పట్టు మధ్య సబర్బన్ రైళ్లు రద్దు కానున్నాయి. ప్రయాణికుల సౌకర్యార్థం రద్దయిన రోజుల్లో చెన్నై బీచ్-పల్లావరం మధ్య ప్రత్యేక రైళ్లు నడపనున్నారు. ఈ మేరకు దక్షిణ రైల్వే విడుదల చేసిన ప్రకటనలో సబర్బన్ రైళ్ల మార్పులు ఇలా ఉన్నాయి...

● చెన్నై బీచ్ నుంచి చెంగల్పట్టుకు ఉదయం 9.30, 9.56, 10.56, 11.40, మధ్యాహ్నం 12.20, 12.40 గంటలకు బయల్దేరే సబర్బన్ రైళ్లు, చెన్నై బీచ్ నుంచి తాంబరానికి ఉదయం 9.40, 9.48. 10.04, 10.12, 10.24, 10.30, 10.36, 10.46, 11.06, 11.14, 11.22, 11.30, 11.50, మధ్యాహ్నం 12, 12.10, 12.30, 12.50 గంటలకు బయల్దేరే సబర్బన్ రైళ్లు రద్దు.

ప్రత్యేక రైళ్లు....

రద్దయిన రైళ్లకు బదులుగా చెన్నై బీచ్ నుంచి ఉదయం 9.30, 9.50, 10.10, 10,30, 10.50, 11.10, 11.30, 11.50, మధ్యాహ్నం 12.10, 12.30, 12.50 గంటలకు బయల్దేరే ప్రత్యేక రైళ్లు పల్లావరం వరకు మాత్రమే నడుస్తాయి.

● చెన్నై బీచ్ నుంచి గుడువాంజేరికి రాత్రి 7.19, 8.15, 8.45, 8.55, 9.40, 10.40, 11.05, 11.30, 11.59 గంటలకు బయల్దేరే రైళ్లు రద్దు.

ప్రత్యేక రైళ్లు...

చెన్నై బీచ్ నుంచి రాత్రి 10.40, 11.30, 11.59 గంటలకు బయల్దేరే రైళ్లు పల్లావరం వరకు మాత్రమే నడుస్తాయి.

తాంబరం, చెంగల్పట్టు-చెన్నై బీచ్...

తాంబరం నుంచి చెన్నై బీచ్‌కు ఉదయం 10.30, 10.40, 11, 11.10, 11.30, 11.40, మధ్యాహ్నం 12.05, 12.35, 1, 1.30 బయల్దేరే రైళ్లు, చెంగల్పట్టు నుంచి గుమ్మిడిపూండికి ఉదయం 10 గంటలకు బయల్దేరే రైలు, కాంచీపురం నుంచి చెన్నై బీచ్‌కు ఉదయం 9.30 బయల్దేరే రైలు, చెంగల్పట్టు నుంచి చెన్నై బీచ్‌కి ఉదయం 11, 11.30, 12 గంటలకు బయల్దేరే రైళ్లు, తిరుమాల్‌పూర్ నుంచి చెన్నైబీచ్‌కి ఉదయం 11.05 గంటలకు బయల్దేరే రైళ్లు రద్దు.

ప్రత్యేక రైళ్లు...

ఈ రైళ్లకు బదులుగా పల్లావరం నుంచి చెన్నై బీచ్‌కు ఉదయం 10.20, 10.40, 11, 11.20, 11.40, మధ్యాహ్నం 12, 12.20, 12.40 1, 1.20, 1.40 గంటలకు ప్రత్యేక రైళ్లు నడుపనున్నారు.

గుడువాంజేరి-చెన్నై బీచ్...

● గుడువాంజేరి నుంచి చెన్నై బీచ్‌కు రాత్రి 8.55, 9.45, 10.10, 10.25, 11.20, 11.40, 11 గంటలకు బయల్దేరే సబర్బన్ రైళ్లు, తాంబరం నుంచి చెన్నై బీచ్‌కు రాత్రి 11.40 గంటలకు బయల్దేరే రైళ్లే రద్దు

ప్రత్యేక రైళ్లు...

రద్దయిన రైళ్లకు బదులుగా పల్లావరం నుంచి చెన్నై బీచ్‌కు రాత్రి 11.30, 11.55, 12.20, 12.45 గంటలకు ప్రత్యేక రైళ్లు నడుపనున్నారు. అలాగే, గుడువాంజేరి నుంచి చెంగల్పట్టుకు ఉదయం 10.45, 11.10, మధ్యాహ్నం 12, 12.50, 1.35, 1.55, రాత్రి 11.55 గంటలు, చెంగల్పట్టు నుంచి గుడువాంజేరికి ఉదయం 10, 1.30, 11. 11.45, మధ్యాహ్నం 12.30, 1, రాత్రి 11 గంటలకు ప్రత్యేక రైళ్లు నడుపనున్నారు.

ప్రైవేటు పాఠశాలలకు బాంబు బెదిరింపు

పెరంబూర్, జూలై 17: స్థానిక పట్టిణంబాక్కంలోని రెండు ప్రైవేటు పాఠశాలలకు బాంబు బెదిరింపులు వచ్చాయి. ఈ-మెయిల్ ద్వారా వచ్చిన బాంబు బెదిరింపు మెసేజ్‌ను చూసిన చెట్టినాడు విద్యాశ్రమం, విద్యామందిర్ పాఠశాలల యజమాన్యాలు పోలీసులకు సమచారమిచ్చారు. బాంబ్ స్క్వాడ్, పోలీసు జాగిలాలతో పాఠశాలలకు చేరుకున్న పోలీసులు క్షుణ్ణంగా పరిశీలించి బాంబు బెదిరింపు ఫేక్ మెసేజ్‌గా నిర్ధారించారు. ఈ బెదిరింపుతో విద్యార్థులు, తల్లిదండ్రుల్లో కలవరం రేపింది. ఈ-మెయిల్ పంపిన చిరునామా కోసం పోలీసులు విచారిస్తున్నారు.

నకిలీ ఎరువుల సంస్థలకు నోటీసులు

ఐసిఎఫ్, జూలై 17: నకిలీ ఎరువులు తయారుచేసి విక్రయించిన సంస్థల వద్ద సంజాయిషీ కోరుతూ వ్యవసాయ శాఖ నోటీసులు జారీచేసింది. ఈ శాఖ అనుమతి పొందిన కొన్ని సంస్థలు లాభాల కోసం నకిలీ ఎరువులు తయారుచేసి విక్రయిస్తున్నాయి. నకిలీ ఎరువులు వినియోగించే రైతులు దిగుబడులు తగ్గడం, పంట నష్టం తదితర కారణాలతో ఇబ్బందులకు గురవుతున్నారు. రసాయన, సహజ ఎరువులు, పురుగుల మందుల నాణ్యత నిర్ధారణకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక విభాగం పనిచేస్తోంది. ఈ విభాగం 2023-24లో 25,962 రకాల రసాయన ఎరువులు తనిఖీచేసి 570 రకాలు నాణ్యత లేనివిగా గుర్తించింది. అలాగే, 1,174 సహజ ఎరువులు తనిఖీ చేసి 11 రకాలు, 22,474 పురుగుల మందులు 166 రకాలు, 60,622 విత్తనాలు తనిఖీ చేసి 1,894 విత్తనాలు నాణ్యత లేవని గుర్తించి నోటీసులిచ్చింది.

3 కేజీల వెండి, రూ.9.41 లక్షలు స్వాధీనం

అడయార్, జూలై 17: చెన్నై ఎగ్మోర్ నుంచి చెంగల్పట్టు మీదుగా వెళ్ళే పల్లవన్ ఎక్స్‌ప్రెస్‌లో తగిన ఆధారాలు లేని 3 కేజీల వెండి, రూ.9.41 నగదును రైల్వే భద్రతా దళం స్వాధీనం చేసుకుంది. మంగళవారం రాత్రి మోహన్ సారథ్యంలోని ఆర్పీఎఫ్ సిబ్బంది ఎగ్మోర్ నుంచి చెంగల్పట్టు వచ్చిన పల్లవన్ ఎక్స్‌ప్రెస్‌లోని బోగీల్లో తనిఖీలు చేశారు. ఆ సమయంలో ఒక వ్యక్తి వద్ద ఉన్న బ్యాగులో చూడగా అందులో 3 కేజీల వెండి, రూ.9.41 లక్షల నగదు గుర్తించారు. వీటికి సంబంధించి తగిన పత్రాలు లేకపోవడంతో వెండితో పాటు నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి ప్రయాణికుడిని విచారణ జరుపుతున్నారు.

రిటైర్డ్ డ్రైవర్‌కు రూ.50 వేల అపరాధం

● మద్రాస్ హైకోర్టు ఆదేశం

అడయార్, జూలై 17: తప్పుడు సమాచారం ఇచ్చిన తమిళనాడు ప్రభుత్వ రవాణా సంస్థలో పనిచేసి రిటైర్ అయిన డ్రైవర్‌కు రూ.50 వేల అపరాధం విధిస్తూ మద్రాస్ హైకోర్టు ఆదేశించింది. రవాణా సంస్థకు చెందిన విల్లుపురం డివిజన్‌లో శ్రీనివాసన్ డ్రైవరుగా పనిచేశారు. ఈయన సమర్పించిన ధ్రువ పత్రాల్లో తన పుట్టిన సంవత్సరాన్ని 1969కు బదులుగా 1964 అని పేర్కొన్నారు. దీన్ని సరిచేసేలా ఆదేశించాలని కోరుతూ ఆయన హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ క్రమంలో ఆయన జూన్‌లో పదవీ విరమణ చేశారు. ఈ నేపథ్యంలో ఈ కేసు విచారించిన న్యాయమూర్తి భరత చక్రవర్తి... పిటిషనర్ సమర్పించిన ఆధారాలను పరిశీలించగా, ఇందులో ఒకటో యేట ఒకటో తరగతిలో చేరి, 13 యేళ్ళ వయసులో ప్లస్‌టూ పూర్తి చేసినట్టుగా ఉంది. ఉద్యోగంలో చేరే సమయంలోనూ, కోర్టుకు అందజేసిన పత్రాల్లోనూ పూర్తిగా తప్పుడు సమాచారం ఇచ్చినందుకు పిటిషనర్‌కు రూ.50 వేల అపరాధం విధిస్తూ కోర్టు ఆదేశించి పిటిషన్ కొట్టివేసింది.

కళ్లకుర్చి వ్యవహారం

సీఐ సహా ఆరుగురిపై చర్యలు

ప్యారీస్, జూలై 17: కళ్లకుర్చిలో కల్తీ సారా సేవించి 67 మంది మృతిచెందిన వ్యవహారంలో ఇన్‌స్పెక్టర్ సహా ఆరుగురు పోలీసులను వీఆర్‌కు బదిలీ చేశారు. కళ్లకుర్చి దుర్ఘటన కేసులో ఎస్పీ సమయసింగ్ మీనా, డీఎస్పీ, ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు మొత్తం 9 మంది అధికారులపై సస్పెన్షన్ వేటుపడింది. కళ్లకుర్చి జిల్లా కలెక్టర్ శ్రావణ కుమార్‌ను వీఆర్‌కు పంపించారు. ఈ నేపథ్యంలో, కల్తీ సారా వ్యాపారులతో ప్రత్యక్ష సంబంధాలు కలిగి విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఎక్సైజ్ పోలీసులు, తహసీలార్లు మొత్తం 78 మందిని రాష్ట్రప్రభుత్వం ఇతర ప్రాంతాలకు బదిలీ చేసింది. కల్తీ సారా విక్రయాలు అడ్డుకోవడంలో విఫలమైన కళ్లకుర్చి ప్రత్యేక విభాగం ఇన్‌స్పెక్టర్ షణ్ముగం, ఎస్సైలు సుబ్రమణియన్, రాజేంద్రన్, ప్రత్యేక విభాగం పోలీసులు బాలసుబ్రమణియన్, గణేశ్, శివజ్యోతి, శరవణన్‌లను వేకెన్సీ రిజర్వ్‌కు తరలిస్తూ ఎస్పీ రజత్ చతుర్వేది బుధవారం ఉత్తర్వులు జారీచేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇన్‌స్పెక్టర్ మృతి



పిచ్చాండి (ఫైల్ ఫొటో)

వేలూరు, జూలై 17: కావేరిపాక్కం పోలీస్‌స్టేషన్‌లో ప్రత్యేక పోలీస్ ఇన్‌స్పెక్టర్‌గా పిచ్చాండి (59) పనిచేస్తున్నారు. ఆయన బుధవారం ఉదయం తన ద్విచక్రవాహనంపై వస్తుండగా, కంటైనర్ లారీని ఢీకొంది. ఈ ఘటనలో పిచ్చాండి ఘటనా స్థలంలోనే మృతిచెందాడు. వాలాజాపేట పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

ఆమ్‌స్ట్రాంగ్ హత్యకేసు...

పొన్నైబాలు సహా ముగ్గురి కస్టడీకి త్వరలో పిటిషన్



పొన్నైబాలు

చెన్నై, జూలై 17 (ఆంధ్రజ్యోతి): బీఎస్పీనేత ఆమ్‌స్ట్రాంగ్ హత్యకేసు నిందితులు ముగ్గురిని కస్టడీలోకి తీసుకుని విచారణ జరిపేందుకు సెంబియం పోలీసులు సిద్ధమవుతున్నారు.. ఈ మేరకేర ఎగ్మూరు కోర్టులో పిటిషన్ వేయనున్నారు. గతేడాది పేరుమోసిన రౌడీ ఆర్కాట్ సురేష్ హంతకులకు ఆమ్‌స్ట్రాంగ్ న్యాయపరమైన సహాయం అందించినందుకు కక్షగట్టి సురేష్ తమ్ముడైన రౌడీ పొన్నైబాలు ఓ పథకం ప్రకారం ఈ హత్య జరిపినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. ఆమ్‌స్ట్రాంగ్ హత్యకేసులో 11 మందిని పోలీసులు అరెస్టు చేశారు. వీరిలో ఆమ్‌స్ట్రాంగ్‌పై కత్తితో తొలివేటు వేసిన రౌడీ తిరువేంగడం మాధవరం వద్ద జరిగిన ఎన్‌కౌంటర్‌లో హతమయ్యాడు. మిగతా 10 మందిని ఎగ్మూరు మేజిస్ట్రేట్ దయాళన్ ఎదుట హాజరుపరిచి పూందమల్లి జైలుకు తరలించారు. ఈ నేపథ్యంలో పొన్నైబాలు, ఆమ్‌స్ట్రాంగ్ హత్యకు పథకం వేయడంలో సహకరించిన నిందితులు తిరుమలై, అరుళ్‌ను మూడు రోజులపాటు కస్టడీలోకి తీసుకుని విచారణ జరిపేందుకు పోలీసులు చర్యలు చేపడుతున్నారు. ఆ మేరకు ఎగ్మూరు కోర్టులో పిటిషన్ దాఖలు చేయనున్నారు.

ఆమ్‌స్ట్రాంగ్ కేసులో మరో ఇద్దరి అరెస్టు

ప్యారీస్, జూలై 17 : బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆమ్‌స్ట్రాంగ్ హత్య కేసుకు సంబంధించి ఓ మహిళా న్యాయవాది సహా ఇద్దరిని బుధవారం సాయంత్రం పోలీసులు అరెస్టు చేశారు. ఎగ్మూరు మేజిస్ట్రేట్ కోర్టు న్యాయవాది మలర్‌కొడి, హరిహరన్ అనే ఇద్దరిని అరెస్టు చేయగా, మలర్‌కొడి నిందితుల్లో ఒకడైన అరుళ్‌తో సెల్‌ఫోన్‌లో మాట్లాడటం, హత్యకు సంబంధించి ఆర్థిక లావా దేవీలపై ఒప్పందం కుదుర్చుకున్నట్లు పోలీసుల తాజా విచారణలో వెల్లడైంది.

మందుబాబులకు చేదువార్త

మద్యం డోర్ డెలివరీ ఉండదు ● టాస్మాక్ ప్రకటన

చెన్నై, జూలై 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆన్‌లైన్ ద్వారా ఆహార పదార్థాలను సరఫరా చేసే ప్రైవేటు సంస్థల సాయంతో ఇళ్లవద్దకే మద్యం సరఫరా చేసే యోచనే లేదని టాస్మాక్ సంస్థ బుధవారం ప్రకటించింది. అంతేకాకుండా త్వరలో టెట్రాప్యాక్‌లో మద్యాన్ని విక్రయించనున్నట్లు ప్రసార మాధ్యమాల్లో వచ్చిన సమాచారాన్ని కూడా ఖండించింది. ఇళ్లవద్దకే మద్యం సరఫరా చేసేందుకు ఆహారపదార్థాలను పంపిణీ చేసే బహుళజాతి సంస్థలతో టాస్మాక్ ఒప్పందం చేసుకుందనే పుకార్లను కూడా సంస్థ ఉన్నతాధికారులు తోసిపుచ్చారు. ఇప్పటికే ఇళ్ల వద్దకే మద్యం సరఫరా చేస్తే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేస్తామని, టాస్మాక్ దుకాణాలను మూసివేస్తామని ప్రధాన పార్టీల నాయకులంతా ప్రకటించారు. ఈ పరిస్థితుల్లో టాస్మాక్ సంస్థ ఎట్టి పరిస్థితులలో ఇళ్ల వద్దకు మద్యం సరఫరా చేయబోమని స్పష్టం చేసింది.



చెన్నై ప్యారీస్ దేవరాజముదలి వీధిలో కూలర్ హోమ్‌ల కోసం కొత్తగా తయారుచేసిన ఎస్‌జీజీ సన్ బాండ్ సోలార్ కంట్రోల్ గ్లాస్, టఫ్నెడ్ గ్లాస్‌లపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ప్రచారంలో పాల్గొన్న సెయింట్-గోబెల్ సంస్థ ఉద్యోగులు

వెట్రిమారన్ 'విడుదలై-2' ఫస్ట్‌లుక్ రిలీజ్

జాతీయ అవార్డు గ్రహీత వెట్రిమారన్ రూపొందించిన 'విడుదలై'కు సీక్వెల్‌గా రూపొందుతున్న 'విడుదలై-2' చిత్రం ఫస్ట్‌లుక్‌ను నిర్మాణ సంస్థ బుధవారం విడుదల చేసింది. సూరి, విజయ్ సేతుపతి ప్రధాన పాత్రలో నటించిన ఈ చిత్రం తొలిభాగం ఘన విజయం సాధించడంతో రెండో భాగంపై భారీగా అంచనాలు నెలకొన్నాయి. ఇళయరాజా సంగీతం సమకూర్చిన ఈ చిత్రాన్ని ఆర్ఎస్ ఇన్ఫోటైన్మెంట్ పతాకంపె ఎల్రెడ్ కుమార్ తమిళం, తెలుగు భాషల్లో నిర్మించారు. ఈ సినిమా ఫస్ట్‌లుక్ రిలీజ్ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ, 'తొలిభాగానికి సినీ ప్రేక్షకుల నుంచి అనూహ్య స్పందన వచ్చింది. మొదటి భాగం అంచనాలను మించి సక్సెస్ సాధించింది. కమర్షియల్ అంశాలతో పాటు రియలిస్టిక్ అప్రోచ్‌తో రూపొందిన ఈ చిత్రం ఈతరం దర్శకులకు సైతం స్ఫూర్తినిచ్చింది. హీరోగా సూరికి మంచి పేరు తెచ్చింది. విజయ్ సేతుపతి 'మహారాజ' బ్లాక్‌బస్టర్ విజయం తర్వాత 'విడుదలై-2' విడుదలకానుంది. ఈ సినిమా ప్రచార కార్యక్రమాల్లో భాగంగా ఫస్ట్‌లుక్‌ను రిలీజ్ చేశాం' అని పేర్కొన్నారు.



'విడుదలై-2'లో ఫస్ట్‌లుక్

వీధి నాటక కళాకారుల కథాంశంతో 'జమా'

ఎన్నో అవార్డులు, రివార్డులు పొందిన 'కూళంగల్' చిత్రాన్ని నిర్మించిన లెర్న్ అండ్ టీచ్ ప్రొడక్షన్ 'జమా' పేరుతో సామాజిక స్పృహతో కూడిన కథాంశంతో ఓ చిత్రాన్ని నిర్మించింది. పారి ఇళవళగన్ హీరోగా నటిస్తూ ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. ఈ ప్రాజెక్టుకు ఇసై జ్ఞాని ఇళయరాజా సంగీతం అందించేందుకు అంగీకరించడంతో ఈ సినిమాపై ఒక్కసారిగా అంచనాలు పెరిగిపోయాయి. ఇందులో హీరోయిన్‌గా అమ్ము అభిరామి నటించగా, నటులు చేతన్, శ్రీకృష్ణ దయాళ్ ముఖ్య పాత్రలను పోషించారు. ఈ సినిమా ఫస్ట్‌లుక్‌తో పాటు టీజర్‌కు ఇప్పటికే మంచి స్పందన వచ్చింది. ఈ నేపథ్యంలో ఆగస్టు 2వ తేదీ చిత్రాన్ని విడుదల చేయనున్నారు. ఈ సినిమా వివరాలను చిత్ర దర్శకుడు పారి ఇళవళగన్, నటుడు చేతన్, నిర్మాత సాయి దేవానంద్‌లు బుధవారం నగరంలో మీడియా సమావేశంలో వివరించారు. దర్శకుడు మాట్లాడుతూ, 'వీధి కళాకారుల జీవనశైలి, వారు ఎదుర్కొనే సవాళ్ళు, కష్టాల నేపథ్యంలో ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. ప్రధానంగా వీధి నాటకాల్లో స్త్రీ పాత్రలను కూడా పురుషులే ధరిస్తుంటారు. తిరునెల్వేలి జిల్లాలోని పిన్నకొండాపట్టి అనే గ్రామంలో ప్రసిద్ధి చెందిన ఒక వీధి నాటక బృందానికి (జమా) చెందిన కథనే ఎంచుకున్నాం. దీనికి కమర్షియల్ ఎలిమెంట్స్ జోడించి అన్ని వర్గాల వారిని ఆకట్టుకునేలా రూపొందించాం. ఇందులో నటించిన వారంతా వీధి కళాకారులే. నటుడు చేతన్ పాత్ర చాలా కీలకమైంది. నాటక బృందం నాయకుడిగా నటించారు. మొత్తం నాలుగు పాటలున్నాయి. ఇందులో ఒక పాటను వీధి నాటక కళాకారులతోనే పాడించడమేకాకుండా, వారు వినియోగించే వాయిద్య పరికరాలనే ఉపయోగించారు' అని వివరించారు. నటుడు చేతన్ మాట్లాడుతూ, 'చాలా యేళ్ళుగా చిత్రపరిశ్రమలో కొనసాగుతున్నాను. 'విడుదలై' చిత్రం నా కెరీర్‌కు మంచి బ్రేక్ ఇచ్చింది. ఆ తర్వాత ఈ చిత్రం మంచి టర్నింగ్ పాయింట్ అవుతుందని నమ్ముతున్నా'నన్నారు. నిర్మాత సాయి దేవానంద్ మాట్లాడుతూ, "కూళంగల్' చిత్రాన్ని నేటివిటీకి చాలా దగ్గరగా తీశాం. అదేవిధంగా వీధి నాటక కళాకారుల జీవనశైలిని కళ్ళ ముందు తెలిపేలా 'జమా'ను రూపొందించాం. తొలి చిత్రాన్ని థియేటర్‌లో విడుదల చేయలేకపోయాం. అందుకే ఈ సినిమాను పిక్చర్ బాక్స్ కంపెనీతో కలిసి సొంతంగా రిలీజ్ చేస్తున్నాం' అని వెల్లడించారు.

చిత్రజ్యోతి



'జమా'లో పారి ఇళవళగన్ - అమ్ము అభిరామి

సైమా అవార్డులు... 12 విభాగాల్లో 'జైలర్' పోటీ

సౌత్ ఇండియా ఇంటర్నేషనల్ మూవీ అవార్డు (ఎస్ఐఐఎంఏ-సైమా) అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం సెప్టెంబరు 14, 15వ తేదీల్లో దుబాయ్ వేదికగా జరుగనుంది. ఇందులో సూపర్ స్టార్ రజనీకాంత్ నటించిన 'జైలర్' మూవీ ఏకంగా 12 విభాగాల్లో సైమా అవార్డుల కోసం పోటీపడుతుంది. ఈ అవార్డుల కోసం పోటీ పడే చిత్రాలు, నటీనటులు, టెక్నీషియన్ల జాబితా తాజాగా వెల్లడైంది. ఇందులో నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వం వహించిన 'జైలర్', మారి సెల్వరాజ్ దర్శకత్వంలో ఉదయనిధి, వడివేలు నటించిన 'మామన్నన్' చిత్రాలు పోటీ పడుతున్నాయి. ముఖ్యంగా తమిళ ప్రాంతీయ భాషలో ఉత్తమ చిత్రాల కేటగిరీలో జైలర్, మామన్నన్, లియో, పొన్నియిన్ సెల్వన్-2, విడుదలై చిత్రాలున్నాయి. ఉత్తమ నటుల విభాగంలో రజనీకాంత్, విజయ్, విక్రమ్, శివకార్తికేయన్ (మావీరన్), ఉదయనిధి ఉన్నారు. ఉత్తమ నటి విభాగంలో త్రిష, నయనతార, ఐశ్వర్యాయార్, కీర్తి సురేష్, మీతా రఘునాథ్, ఐశ్వర్య రాజేష్ ఉన్నారు. ఉత్తమ దర్శకుల కేటగిరీలో నెల్సన్, లోకేష్ కనకరాజ్, మణిరత్నం, వెట్రిమారన్, అరుణ్ కుమార్, మారి సెల్వరాజ్ ఉన్నారు.



'జైలర్'లో ఓ దృశ్యం



నగరంలో సీనియర్ హీరో విజయ్‌ను బుధవారం ఆయన నివాసంలో తన భర్త, పిల్లలతో కలిసిన సినీ నటి రంభ.

కోలాహలంగా 'కొబ్బరి' పండుగ

- ఆడి మాసంలో విశేషం
- కొంగు జిల్లాల్లో ప్రత్యేకం



కొబ్బరి తయారీ విధానం



యువత కోలాహలం



ధర్మపురిలోని ఓ గ్రామంలో పాల్గొన్న గ్రామస్తులు

పెరంబూర్, జూలై 17: నామక్కల్, సేలం, ధర్మపురి సహా పలు జిల్లాల్లో కొబ్బరికాయలు కాల్చే పండుగను ప్రజలు కోలాహలంగా జరుపుకున్నారు. ప్రతి ఏడాది ఆడి మాసం మొదటి రోజున ఈ పండుగను ప్రజలు ఆచరిస్తుంటారు. తమిళ మాసాల్లో ఆడి నెలను ముఖ్యమైనదిగా పేర్కొంటారు. ఈ ఏడాది ఆడి నెల బుధవారం ప్రారంభమైంది. మహాభారత పారాయణం ఆడి నెల మొదటి రోజున ప్రారంభించి 18 రోజులు నిర్వహించి, ఆడి 18వ రోజు ముగిస్తారు. మహాభారత యుద్ధంలో ధర్మం గెలవాలంటూ కోరుతూ ఆడి నెల మొదటి రోజున ప్రజలు వినాయకుడు, వారి ఇష్టదైవాలకు పూజలు చేస్తుంటారు. ఆ రోజున కొబ్బరికాయలు కాల్చి, దానిని ప్రసాదంగా అందజేయడం ఆనవాయితీగా వస్తోంది. రాష్ట్రంలో కొంగు జిల్లాలైన నామక్కల్, సేలం, ధర్మపురి తదితర జిల్లాల్లో కొబ్బరికాయలు కాల్చే పండుగ కోలాహలంగా జరిగింది.

కొబ్బరి కాయ తయారుచేసే విధానం...

ఈ పండుగ కోసం మంచి కొబ్బరికాయ తీసుకుని, కాయలోని ఓ కన్నుకు రంధ్రం వేసి నీరు తీసి ఓ పాత్రలో ఉంచుకుంటారు. కాయపై ఉన్న పీచు తీసేసి పసుపు రాస్తారు. అనంతరం నువ్వులు, ఉసిరికాయ, బెల్లం, చింతపండు, ఆవాలు, వేరుశెనగ తదితరాలను మెత్తగా రుబ్బుకుంటారు. రుబ్బిన మిశ్రమాన్ని కొబ్బరికాయలోకి రంధ్రం ద్వారా లోపలనింపుతారు. అనంతరం మైదా, పాత్రలో తీసిపెట్టిన కొబ్బరి నీళ్లను రంధ్రం ద్వారా తిరిగిపోయాలి. దీంతో కొబ్బరి కాయ సిద్ధమవుతోంది.

కాల్చే విధానం...

అలా తయారుచేసిన కొబ్బరికాయ లోపల పొడవాటి కర్ర చొప్పించాలి. కర్ర అంటే అన్ని కర్రలు కాకుండా 'అంకోలా' కర్రలు తీసుకోవాలి. కర్రకు పసుపురాసి కొబ్బరికాయ కంటి రంధ్రం ద్వారా కర్రను చొప్పించాలి. అనంతరం ఇంటి ముందు మంటలు వేసి కొబ్బరికాయను బాగా కాల్చాలి. బాగా కాలిన కొబ్బరికాయ పగిలిపోతుంది. ఇక, కొబ్బరి చిప్ప నుంచి కొబ్బరి తీసి స్వామివారిని నైవేద్యంగా సమర్పించి, ఇంటిల్లిపాది ప్రసాదంగా స్వీకరిస్తారు. ఇక, కొబ్బరి కాయలో అంతకు ముందు ఉంచిన మిశ్రమం కొబ్బరి నీళ్లతో కలసి అద్భుతమైన రుచి కలిగి ఉంటుంది.



సేలంలో పండుగలో చిన్నారులు

ఆరోగ్యం కూడా...

ఈ ఆరోగ్యమైన డైట్ ద్వారా పొట్టలోని అల్సర్‌కు ఎంతో పనిచేస్తాయి. నువ్వులు, ఉసరి కాయ, వేరుశెనగ తదితర మిశ్రమం ఆరోగ్యకరమైనది. ఈ నేపథ్యంలో, ఆడి నెల మొదటి రోజు కావడంతో సేలం, నామక్కల్, ధర్మపురి జిల్లాల్లోని పలు గ్రామాల్లో ఉదయాన్ని పిల్లల నుంచి పెద్దల వరకు ఈ పండుగలో ఆనందంగా పాల్గొన్నారు.

ట్రాఫిక్ రద్దీకి చెక్

- నాలుగు రోడ్ల విస్తరణకు జీసీసీ చర్యలు



అడయార్ ఎల్బీ రోడ్డు

పెరంబూర్, జూలై 17: చెన్నై మహానగరంలో ట్రాఫిక్ రద్దీ అధికంగా ఉన్న నాలుగు రోడ్లు గుర్తించి, వాటిని విస్తరించేందుకు గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) చర్యలు చేపట్టింది. ఓట్టేరి కుక్స్ రోడ్డు విస్తరించినట్లే, కొత్తగా ఎంపిక చేసిన నాలుగు రోడ్లను విస్తరించనున్నారు. జీసీసీ పరిధిలో 1,857 కి.మీ మేర 10,628 రోడ్లున్నాయి. నగర జనాభాతో పాటు వాహనాల సంఖ్య కూడా పెరుగుతోంది. దీంతో, ఉదయం, సాయంత్రం 'పీక్ అవర్స్'లో, ట్రాఫిక్ రద్దీ అధికంగా ఉంటోంది. ఈ సమస్య అధికమించేలా నగరంలో రద్దీ అధికంగా రోడ్లను గుర్తించి, సీఎండీఏ సహకారంతో విస్తరించాలని జీసీసీ నిర్ణయించింది. అందుకోసం, అధికారులతో ఇటీవల జీసీసీ మేయర్ ప్రియ సమావేశమయ్యారు. తొలివిడతగా, మైలాపూర్ డా.రాధాకృష్ణన్ రోడ్డు, పెరంబూర్ పేపర్ మిల్స్ రోడ్డు, అడయార్ ఎల్బీ రోడ్డు, న్యూ ఆవడి రోడ్డు తదితర నాలుగు రోడ్లు విస్తరించాలని నిర్ణయించారు. ఆ ప్రకారం, 80 అడుగులున్న డా.రాధాకృష్ణన్ రోడ్డు వందడుగులమేర విస్తరించనున్నారు. ఈ రోడ్డు విస్తరణతో మైలాపూర్, రాయపేట, థౌజండ్ లైట్స్, తేనాంపేట తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీ తగ్గే అవకాశముంది. అలాగే, 60 అడుగుల వెడల్పున్న ఎల్బీ రోడ్డు, 100 అడుగుల రోడ్డుగా విస్తరించనున్నారు. ఈ మార్గంగ మధ్యకైలాష్, తిరువాన్మియూర్, అడయార్ తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీ తగ్గే అవకాశముంది. అదేవిధంగా 60 అడుగుల వెడల్పు కలిగిన న్యూ ఆవడి రోడ్డు, కొన్ని ప్రాంతాల్లో 100 అడుగులు, 33 అడుగుల వెడల్పు కలిగిన పెరంబూర్ పేపర్ మిల్స్ రోడ్డు 60 అడుగుల రోడ్డుగా విస్తరించనున్నారు. ఈ రోడ్లపై ఆక్రమణలు గుర్తించి వాటిని తొలగించి, రోడ్డు విస్తరణకు సంబంధించిన ప్రణాళిక రూపొందిస్తున్నారు. ప్రణాళిక సిద్ధం చేసిన తర్వాత, ప్రభుత్వ అనుమతులు పొంది నగరంలో రోడ్ల విస్తరణ చేపట్టనున్నట్లు జీసీసీ అధికారులు తెలిపారు.



29 నుంచి సెల్ఫ్ డిఫెన్స్‌పై బాలికలకు శిక్షణ

అడయార్, జూలై 17: స్థానిక వేళచ్చేరిలోని గురునానక్ కాలేజీ (స్వయంప్రతిపత్తి)లో ఉడైయల్ పడై పేరుతో బాలికలు, మహిళలకు సెల్ఫ్ డిఫెన్స్ (ఆత్మరక్షణ) పద్ధతులపై శిక్షణ ఇస్తుంది. ఇందులో పాఠశాల, కాలేజీ విద్యార్థినులు కార్పొరేట్ సంస్థలకు చెందిన మహిళలు, గృహిణులు పాల్గొంటున్నారు. 'పీఈఎస్ఎన్ (పెన్) ట్రస్ట్‌తో కుదుర్చుకున్న ఒప్పందం మేరకు బాలబాలికలకు శారీరక, మానసిక, న్యాయపరమైన అంశాలపై శిక్షణ, అవగాహన కల్పిస్తుంది. గురునానక్ సెంటర్ ఫర్ కన్సల్టెన్సీ అండ్ ఔట్రీస్ ఇనిషియేటివ్స్ కింద ఇప్పటివరకు 2100 మంది మహిళలు శిక్షణ పొందారు. ఈ శిక్షణలో బాలబాలికలకు స్వీయ రక్షణ కోసం వివిధ పద్ధతులను నేర్పిస్తారు. ఈ శిక్షణ ఈ ఒక్క కాలేజీకే పరిమితం కాకుండా ఉత్తర చెన్నైలోని వివిధ కాలేజీలకు చెందిన విద్యార్థులకు కూడా నేర్పించారు. తాజాగా, వేళచ్చేరిలోని డీఏవీ పబ్లిక్ స్కూల్ మూడు రోజుల వర్క్‌షాపును ఈ నెల 19 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించనున్నారు. పూర్తి వివరాల కోసం 044- 22451746, 044-22444621 అనే ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చు.

ఆడి నెల రాయితీలు... కారైక్కుడిలో పట్టుచీరల కొనుగోళ్లు



కారైక్కుడి దుకాణంలో చీరలు కొనుగోలు చేస్తున్న మహిళలు

పెరంబూర్, జూలై 17: శివగంగ జిల్లా కారైక్కుడిలో 20 శాతం నుంచి 60 శాతం రాయితీ ధరలకు పట్టుచీరల విక్రయాలు ప్రకటించడంతో మహిళలు ఆసక్తిగా కొనుగోళ్లు చేశారు. ఆడి నెల అంటేనే మొదటి గుర్తుకొచ్చేది రాయితీ ధరలు. ఈ నెలలో ముహూర్తాలు తక్కువగా ఉండడంతో జౌళి దుకాణాల వ్యాపారులు పట్టుచీరలు, దుస్తుల విక్రయాలపై భారీ రాయితీ ప్రకటిస్తుంటారు. ఈ నేపథ్యంలో, శివగంగ జిల్లా కారైక్కుడిలో జౌళి దుకాణాల వ్యాపారుల ఆధ్వర్యంలో కల్యాణ మండపంలో ప్రత్యేక విక్రయ కేంద్రం ఏర్పాటుచేశారు. పట్టుచీరలపై 20 నుంచి 60 శాతం రాయితీ ప్రకటించారు. ఆడి నెల మొదటి రోజున బుధవారం నుంచి ఈ విక్రయ కేంద్రం ప్రారంభమవుతుందనే ప్రకటనతో, ఉదయం నుంచే మహిళలు కల్యాణ మండపం వద్ద బారులు తీరారు.

మెరీనా బీచ్‌కు నూతన సొబగులు

- సీఎండీఏ చర్యలు



ప్యారీస్, జూలై 17: స్థానిక మెరీనా బీచ్‌కు నూతన సొబగులు దిద్దేందుకు చెన్నై మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (సీఎండీఏ) ప్రణాళిక రూపొందించింది. మెరీనా తీరం సమీపంలో ఉన్న వారసత్వ కట్టడాలకు భంగం కలిగించకుండా లేజర్ గార్డెన్స్, వాటర్ ఫౌంటైన్ తదితర వసతులను సమకూర్చనుంది. మెరీనా తీరం దేశంలోనే అతిపొడవైన, ప్రపంచంలో అందమైన రెండో బీచ్‌గా గుర్తింపు పొందింది. సెయింట్ జార్జి కోట నుంచి బీసెంట్ నగర్ వరకు సుమారు 12 కి.మీ మేర 1880వ సంవత్సరం అధికారంలో ఉన్న బ్రిటీష్ చీఫ్ ఇంజనీర్ మౌంట్ స్టార్ట్ ఎలిఫెంట్ స్టోన్‌గ్రాంట్ ఈ బీచ్‌ను పునరుద్ధరించారు. ఈ నేపథ్యంలో, మెరీనా నుంచి కోవలం వరకు గల 30 కి.మీ సముద్రతీరాన్ని అభివృద్ధి పరిచేందుకు ప్రత్యేక సంస్థతో కలిసి సీఎండీఏ ప్రణాళిక రూపొందించి, ఇందుకోసం రూ.100 కోట్లు కేటాయించింది. ఇందులో తొలివిడతగా మెరీనా బీచ్‌లో సేదతీరేందుకు వచ్చే పర్యాటకులకు ఆకట్టుకొనేలా అత్యాధునిక వసతులతో నమూనా రూపొందించింది. దీని ప్రకారం 30 కి.మీ సముద్రతీర ప్రాంతాన్ని ఐదు విభాగాలుగా విభజించింది. మెరీనా బీచ్‌లో ప్రసిద్ధి చెందిన శాంతోమ్ చర్చి వెనుక వైపు నుంచి నేపియర్ వంతెన వరకు 4 కి.మీ మేర కళాచార, వినోదభరిత కేంద్రాలు ఏర్పాటుకానున్నాయి. మరోవైపు మెరీనా బీచ్ సమీపంలోని కామరాజర్ రోడ్డులో వంగేళ్లకు పైగా ఉన్న వారసత్వ కట్టడాలైన మద్రాసు యూనివర్సిటీ, శాంతోమ్ చర్చి, ప్రజాపనుల శాఖ కార్యాలయ భవనాలకు నష్టం వాటిల్లకుండా ప్రత్యేక చర్యలు చేపట్టింది. వివేకానంద హౌస్, ఐస్ హౌస్, రాజధాని కళాశాల ప్రాంతాల్లో తొలివిడతగా లేజర్ గార్డెన్లు, వాటర్ ఫౌంటైన్లు, శిల్పాలు, పర్యాటకులకు సమాచారం తెలియజేసే ప్యానళ్లు, కూర్చొనేందుకు సీటింగ్ తదితర వసతులు కల్పించనుంది. ముఖ్యంగా కామరాజర్ రోడ్డులో ఉన్న ఫుట్‌పాత్‌లను అందంగా తీర్చిదిద్దేందుకు సీఎండీఏ రూ.10 కోట్లు నిధులు కేటాయించింది.



షెరటాన్ గ్రాండ్ చెన్నై రిసార్ట్‌లో పెంపుడు జంతువులకు ప్రత్యేక వసతులు

చెన్నై, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మహాబలిపురం సమీపంలోని షెరటాన్ గ్రాండ్ చెన్నై రిసార్ట్ అండ్ స్పాలో అతిథులతోపాటు వచ్చే శునకాలు తదితర పెంపుడు జంతువులకు ప్రత్యేక వసతులు కల్పిస్తున్నట్లు ఆ రిసార్ట్ జనరల్ మేనేజర్ సప్తరిషి బిశ్వాస్ తెలిపారు. పెంపుడు జంతువులు పడుకునేందుకు ప్రత్యేకమైన పరుపులు, చాపలు, కాలకృత్యాలు తీర్చుకునేందుకు ప్రాంతం, సముద్రతీరంలో అతిథులతోపాటు వాకింగ్ వెళ్లేటప్పుడు వాటికి ప్రత్యేక దుస్తులు వంటి సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. ఇతర వివరాలను 7824010212 అనే నెంబర్‌కు ఫోన్ తెలుసుకోవచ్చునని ఆయన పేర్కొన్నారు.



గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ కొత్త కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన జె.కుమరగురుబరన్



చెన్నైలో త్యాగధనుల సంస్మరణదినం సందర్భంగా గిండి గాంధీమండపం వద్ద త్యాగధనులు ఆర్యా అలియాస్ బాష్యం, సెన్నగరామన్, శంకరలింగనార్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మంత్రి సుబ్రమణ్యం, మేయర్ ప్రియ, ఎమ్మెల్యేలు సెల్వపెరుంతగై, జేఎంహెచ్ హసన్ మౌలానా, ఏఎం ప్రభాకర్‌రాజా, డిప్యూటీ మేయర్ మహేష్‌కుమార్ తదితరులు





చెన్నై టి.నగర్‌లోని సీపీఎం రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో బుధవారం జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశంలో పాల్గొన్న ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ప్రకాష్ కారత్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.బాలకృష్ణన్, జాతీయ కమిటీ సభ్యులు వాసుకి, రాష్ట్ర నిర్వాహణ కమిటీ సభ్యులు కె.బాలభారతి తదితరులు